క్లుప్తంగా


గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా



ఖాళీగా ఉన్న కుర్చీలు

నరసన్నపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రతీ సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నారు. కొంతమంది మండల స్థాయి అధికారులు తమకు నచ్చినప్పుడు వస్తుండగా.. మరికొందరు పూర్తిగా రావడం లేదు. సోమవారం నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు కేవలం ఐదు శాఖల నుంచే అధికారులు హాజరయ్యారు. దీనిపై తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వర ప్రసాద్‌లు మాట్లాడుతూ.. విధిగా అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌కు రావాలని ప్రతీవారం చెబుతున్నామన్నారు.

అంధకారంలో ఎస్సీ కాలనీ



చీకటిలో ఉన్న ఎస్సీ కాలనీ

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో గల ఎస్సీ కాలనీ వాసులు గత కొద్ది రోజులుగా చీకటిలో ఉంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున్న వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలగడం లేదు. రాత్రి పూట ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సచివాలయ సిబ్బంది స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

సంయుక్త కార్యదర్శిగా గిరీష్‌కుమార్ పట్నాయక్



కొత్తూరు: జిల్లా వీఆర్వోల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా మండలంలోని వసప వీఆర్వో గిరీష్ కుమార్ పట్నాయక్ ఎన్నిక కావడంతో పలువురు అభినందనలు తెలిపారు. గిరీష్‌కుమార్‌కు కొత్తూరు తహసీల్దార్, మండలంలోని పనిచేస్తున్న వీఆర్వోలు సోమవారం అభినందించారు. వీఆర్వోల సమస్యలను జిల్లా సంఘం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని గిరీష్‌కుమార్ తెలిపారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని ఆషాఢ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా సోమవారం తిరువీధి నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోమ్ సందర్శన



కొత్తూరు: విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి హరిబాబు

కొత్తూరు/హిరమండలం: రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాలతోపాటు జిల్లా న్యాయసేవాధికారి సంస్థ అధ్యక్షుడు జె.అహమ్మద్ మౌలానా సూచనల మేరకు కొత్తూరులోని క్లూనీ చిల్డ్రన్ హోమ్, హిరమండలంలోని గ్రేసీ చిల్డ్రన్ హోమ్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు సోమవారం సందర్శించారు. వంట, భోజనశాలలను పరిశీలించారు. కొత్తూరులో విద్యార్థులకు అందుతున్న భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తెలపాలని పిల్లలను అడిగారు. దోమలు ఎక్కువగా ఉన్నాయని, దోమల నివారణకు ఆలౌట్‌లు ఇప్పించాలని కోరారు. సమస్యలు ఉంటే హోమ్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్స్‌లో రాసి వేయాలన్నారు. మరోసారి సందర్శనకు వచ్చి ఫిర్యాదులను చూస్తానన్నారు. చిల్డ్రన్ హోమ్‌ల నిర్వాహకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణపై ఫిర్యాదు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు సెంటర్‌లోని ఇరపాడు కూడలి ఆర్టీసీ బస్ షెల్టర్‌కు అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానిక తహసీల్దార్‌ను మెట్టూరు జై దుర్గా భవానీ ఆటో యూనియన్ ప్రతినిధులు కోరారు. ప్రభుత్వ స్థలాన్ని ఇ.గోవిందరావు, ప్రభాకరరావుతోపాటు పలువురు ఆక్రమించుకున్నట్లు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఆటో యూనియన్ అధ్యక్షుడు జి.కృష్ణారావు, పలువురు సభ్యులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో దుకాణాలు, పక్కా గృహాలు నిర్మించడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. పలుసార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

కాలువలు ఇలా..

సాగునీరు ఎలా?



బలద గ్రామం వద్ద పిచ్చిమొక్కలతో నిండిన కాలువ గెడ్డ దుస్థితి

- మొక్కలతో నిండిన కాలువలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- సాగునీరు అందక ఆలస్యవుతున్న దమ్ములు

కొత్తూరు: సాగునీటి కాలువలను బాగుచేసి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రధాన సాగునీటి కాలువలు మొక్కలు, పూడికలతో నిండిపోయాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కాలువలను బాగుచేయాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగునీరు అందకపోవడంతో దమ్ము చేపట్టే పనులు ఆలస్యమవుతున్నాయి.

వర్షాధారం..

కొత్తూరు మండలం పూర్తిగా వర్షాధారంపై ఆధారపడింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలంలోని తివ్వకొండల్లో పడిన వర్షాలు, ఒడిశా రాష్ట్రంలో కురిసిన వర్షాలతో కొత్తూరు మండలానికి సాగునీరు అందుతుంది. మండలంలోని హడ్డుబంగి గెడ్డ, కాలువ గెడ్డ, కారి గెడ్డ, తంపర గెడ్డ, ఎదుర్ల గెడ్డతోపాటు పలు ప్రధాన సాగునీటి కాలువలు, పిల్ల కాలువలు మొక్కలతోపాటు పూడికలతో నిండిపోయాయి. కుంటిభద్ర, వసప ఓపెన్ హెడ్ చానళ్లు పూర్తిగా పాడయ్యాయి. కడుము ఓపెన్ హెడ్ ఛానల్ అంతంత మాత్రంగా పని చేస్తుంది.



మొక్కలతో నిండిన హడ్డుబంగి గెడ్డ

మండలంలోని 43 పంచాయతీల పరిధిలో 346 చెరువులున్నాయి. వీటి ద్వారా సుమారు పది వేల హెక్టార్లకు సాగునీరు అందుతుంది. ఈ చెరువులకు సంబంధించిన పిల్ల కాలవలను ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేయాల్సి ఉన్నప్పటికీ.. కొన్ని గ్రామాల్లోనే చేపట్టారు.

ప్రతిపాదనలు పంపించాం..

ఫీడర్ ఛానళ్ల నుంచి పొలాల్లోకి వెళ్లే కాలువలను ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయించాలని ఉపాధి సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. ఫీడర్ చానళ్లలో పూడికలు తీసేందుకు పనులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం.

– ప్రసాదరావు, జేఈఈ, నీటిపారుదల శాఖ, కొత్తూరు మండలం

పైపైనే పనులు..

నీటిపారుదలశాఖ పరిధిలో ఉన్న ఫీడర్ ఛానళ్లు నిర్లక్ష్యపు నీడలో ఉన్నాయి. కాలువగెడ్డ, హడ్డుబంగి గెడ్డల్లో పూడకలు తీయడానికి సుమారు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నిధులు అవసరం ఉండగా.. కేవలం రూ.5 లక్షలతో పనులు చేపట్టారు. మిగిలిన ఫీడర్ ఛానళ్లు బాగు చేయకపోవడంతో చెరువుల నుంచి సాగునీరు సక్రమంగా అందడం లేదు. జూలై నెల నాలుగో వారం వచ్చినా.. మండలంలో దమ్ములు జరగడం లేదు. వరి నారు మడులు, వెదలు ఎండిపోయే ప్రమాదం ఉంది. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి అన్ని సాగునీటి కాలువల్లో పూడకలు తొలగించి సాగునీరు అందివ్వాలని రైతులు కోరుతున్నారు.

పనులు చేపట్టలేదు..



ఒడిశాలో వర్షాలు పడితే కాలువ గెడ్డకు నీరు వస్తుంది. అటువంటి ప్రధానమైన సాగునీటి కాలువలో పేరుకుపోయిన పూడికలు, మొక్కలను ఇంతవరకు తొలగించలేదు. సాగునీరు అందక దమ్ములు చేయలేక పోతున్నాం.

– మాతల తిరుమల, రైతు, బలద, కొత్తూరు మండలం

సాగునీరు అందడం లేదు..



మండలంలోని ప్రధాన సాగునీటి కాలువ అయిన హడ్డుబంగి గెడ్డ నిర్లక్ష్యానికి గురైంది. కొన్నిచోట్ల గెడ్డ ఆక్రమణలకు గురైంది. మొక్కలు దట్టంగా పెరిగాయి. కొత్తూరులో ఈ కాలువ డప్పింగ్ యార్డుగా తయారైంది. పారాపురం, కలిగాం, బమ్మిడి, కొత్తూరు పొలాలకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో వర్షాలపై ఆధారపడాల్సి వస్తోంది.

– వనము లక్ష్మీనారాయణ, రైతు, పారాపురం, కొత్తూరు మండలం

నాగభూషణరావుకు ఘన నివాళి



హిరమండలం: ఎల్.ఎన్.పేటలో నాగభూషణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పాతపట్నం: నాగభూషణరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

హిరమండలం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త నాగభూషణరావు వర్ధంతిని ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు, సర్పంచ్‌లు యోగేశ్వరరావు, తొత్తడి మురళీకృష్ణ, బలగ గోవిందరావు, ఈగల చిన్నారావు, ముగడ దివాకర్, కొల్ల కృష్ణ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి నాగభూషణరావు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, హిరమండలం మండలం అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎ.వి.సురేష్, నాయకులు గోకవలస రాము, పద్ద నేతాజీ, మామిడి గంగాధర్, మజ్జి తిరుపతిరావు, పనుకు మోహన్, చింతాడ త్రినాథరావు, పెద్దింటి సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొతూరులో..

కొత్తూరు: మండల కేంద్రంలో నాగభూషణరావు వర్ధంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ ధర్మారావు, నాయకులు నివాళులర్పించారు. పార్టీ నాయకులు వనుము లక్ష్మీనారాయణ, దూలి అప్పన్న, యతిరాజు, లోకేష్, అశోక్‌కుమార్, రాజా, హిమగిరి, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి భర్త నాగభూషణరావు వర్ధంతిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, భాస్కరదాస్, సలాన చిట్టి, తేజారావు, యోగీశ్వరరావు, మాడుగుల మనికంఠ, చాపర శ్రీకరుణ, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 'వారధి' చేయూత



పుస్తకాలు, పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న ట్రస్టీ చైర్మన్, సభ్యులు

నరసన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పేద విద్యార్థులకు ఎస్‌వీసీటీ స్వచ్ఛంద సంస్థ వారధి కార్యక్రమం ద్వారా చేయూత ఇస్తుందని ట్రస్టు చైర్మన్ కె.రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కాకినాడకు చెందిన పడాల చారటబుల్ ట్రస్టుతో కలిసి పేద విద్యార్థుల అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మండల పరిధిలో ఐదు స్కూళ్లల్లో తల్లిదండ్రులు లేని పిల్లలు 53 మందిని దత్తత తీసుకున్నట్లు వివరించారు. వారికి అవసరమైన పుస్తకాలు, పౌష్టికాహారాన్ని అందించారు. ఏడాదికి రెండు జతల దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎస్‌వీసీటీ ట్రస్ట్ సభ్యులు టంకాల వజ్రసాయి కిరణ్, డాక్టర్ టి.రాజకమల్, పడాల ఫైనాన్స్ డైరెక్టర్ కృష్ణంరాజు, అడ్మినిస్ట్రేవ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, బొరిగివలస స్కూల్ హెచ్ఎం నీరజ, ఎస్‌వీసీటీ పీఆర్వో సదాశివుని కృష్ణ, ట్రస్టు ప్రతినిధులు రమేష్, కరుణ, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.


కూటమి పాలనంతా మోసం

- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్‌సీపీ నాయకులు



పోలాకి: తలసముద్రంలో కూటమి మోసాలను తెలిపే క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు

పోలాకి: రాష్ట్రంలో కూటమి పాలనలో అంతా మోసం, దగా, అవినీతి, కక్షపూరిత రాజకీయాలే అని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం తలసముద్రం, మబగాం, వనితమండలం పంచాయతీల్లో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తెలిపే క్యూఆర్ కోడ్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ నాయకులు భావన వైకుంఠరావు, ఎన్ని వెంకటేష్, రెంటికోట త్రినాథరావు, చింతు రాఘవరావు, సాలిన నగేష్‌కుమార్, చింతాడ ఉమమహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సారవకోట: వాండ్రాయి క్యూఆర్ కోడ్‌లను అందజేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, పార్టీ నాయకులు

సారవకోటలో..

సారవకోట: మండలంలోని వాండ్రాయి, కూర్మనాథపురం పంచాయతీల్లో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ మోసాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై మహిళలకు అవగాహన కల్పించి, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌లను పంపిణీ చేశారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గెల్లంకి వెంకటరావు, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్‌లు కొండాల బాబూరావు, కోరుకొండ శంకరబాబు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, ఎడ్ల రంగారావు, నిక్కు రాజశేఖర్, గొర్లె ఢిల్లీరావు, పొన్నాన మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలంలోని లుకలాం, ముషిడిగట్లు, కామేశ్వరిపేట, కొత్తపోలవలసల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ.. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలందరినీ మోసం చేసిందన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ నాయకులు లుకలాపు రవి, యాబాజి రమేష్, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు, పుట్ట ఆదిలక్ష్మి, బగ్గు రమణయ్య, బుద్దల రాజశేఖర్, చింతల సత్యం, దుల్ల రమణ, వాకముళ్ల చక్రదర్, కనపల శేఖరరావు, నేతింటి రాజేశ్వరరావు, సతివాడ రామినాయుడు పాల్గొన్నారు.



లుకలాంలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న నాయకులు

జలుమూరులో..



కొమనాపల్లిలో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

జలుమూరు: మండలంలోని కొమనాపల్లి, అచ్చుతాపురం, కత్తిరివానిపేట గ్రామాల్లో కూటమి ప్రభుత్వ మోసాలను ఎంపీపీ వాన గోపి ఆధ్వర్యంలో ప్రజలకు వివరించారు. అన్ని వర్గాలను సీఎం చంద్రబాబు చేసిన మోసాలను తెలిపే బ్రోచర్లను ప్రజలకు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ధర్మాన జగన్, నాయకులు పైడి విఠల్‌రావు, బి.వి.రమణ, పి.విజయ్, మూకళ్ల సత్యం, మెండ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం



ఎల్.ఎన్.పేటలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని, రాజకీయ కక్ష సాధింపులో భాగామేనని వైఎస్సార్ సీపీ ఎల్.ఎన్.పేట మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు అన్నారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి సోమవారం విలేకర్లతో మాట్లాడారు. మిథున్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షసాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం తెర తీసిందన్నారు. రాజకీయ కక్ష సాధింపులు మానకపోతే కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఈగల చిన్నారావు, సర్పంచ్‌లు ముగడ దివాకర్‌నాయుడు, యోగేశ్వరరావు, బలగ గోవిందరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

మిథున్ రెడ్డి అరెస్టు అన్యాయం



కోట గోవిందరావు

ఆమదాలవలస: రాజకీయ కక్ష సాధింపుతోనే వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. ఆమదాలవలసలోని తన కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా లిక్కర్ స్కామ్‌లో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేశారన్నారు. ప్రజలు నమ్మి అధికారం ఇచ్చింది రాష్ట్రానికి మంచి చేయాలని, దాడులు చేయడానికి కాదని హితవు పలికారు. కుట్రలు పన్నడంలో దిట్ట అయిన సీఎం చంద్రబాబు.. సంక్షేమ పథకాల అమలులో మాత్రం అసమర్థుడని ఆరోపించారు. ఇప్పటికైనా తప్పుడు కేసులు పెట్టడం మానుకొని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

అక్రమ అరెస్టులతో వైఎస్సార్‌సీపీని ఆపలేరు



మాట్లాడుతున్న కరిమి రాజేశ్వరరావు

పోలాకి: అక్రమ అరెస్టులతో వైఎస్సార్‌సీపీని ఆపలేరని, కూటమి ప్రభుత్వం కేసులతో భయపెట్టాలని చూస్తోందని డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. సోమవారం పోలాకిలో పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మద్యం కట్టుకథలో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయటం కేవలం ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను దృష్టి మరల్చడానికే అని అన్నారు. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఎదురునిలిచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించారని గుర్తుచేశారు. అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే వైఎస్ జగన్ అభిమానులను, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మరింత రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారన్నారు. జిల్లా రాజకీయాల్లో సైతం ఎప్పుడూ లేని హత్యా రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలు తెరమీదకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు,పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానిది కక్ష సాధింపు చర్య



బొడ్డేపల్లి రమేష్‌కుమార్

ఆమదాలవలస: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ఉన్న కక్ష కారణంగానే ఎంపీ మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అన్యాయంగా అరెస్ట్ చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీలో ఏ డిస్టిలరీస్‌లో మద్యం కొనుగోలు చేశారు, ఓనర్ ఎవరు, ఆ డిస్టిలరీస్‌కి అనుమతి ఇచ్చింది ఎవరో బహిర్గతం చేయాలన్నారు. డిస్టిలరీస్ ద్వారా అవినీతి జరిగితే వాటి యజమానులను ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. ఈ ప్రభుత్వంలోనూ ఇప్పటికీ అదే డిస్టిలరీస్ నుంచి కొనుగోలు చేస్తున్నారా, లేదా? ఇవన్నీ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన చేయాలి తప్ప.. కక్షపూరితంగా ఉండకూడదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని, ప్రజాస్వామ్యంలో ఇది ఒక దుర్మార్గపు చర్య అని అన్నారు.

సంక్షిప్తంగా..

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

పాతపట్నం: మండలంలోని గంగువాడ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మహిళకు తీవ్రగాయాలయ్యాయి. టెక్కలి ఐతం ఇంజినీరింగ్ విద్యా సంస్థలకు చెందిన బస్సు పాతపట్నం నుంచి టెక్కలి వైపు వెళ్తూ.. అదే దారిలో నడుచుకుంటూ వెళ్తున్న రావలవలస నందిని ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. క్షతగాత్రురాలిని స్థానికులు పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీతాలు చెల్లించాలి

ఆమదాలవలస: ఎం.టి.ఎస్ (మినిమం టైమ్ స్కేల్) ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు పైడి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత మూడు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు అందలేదన్నారు. ఎం.టి.ఎస్ ఉపాధ్యాయులందరికీ 62 ఏళ్ల వరకు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, 12 నెలలు జీతం చెల్లించాలని కోరారు. మండల గౌరవాధ్యక్షుడు మెట్ట సన్యాసిభట్లు, మండల ప్రధాన కార్యదర్శి గణేష్, మండల బాధ్యులు వెంకటరమణ, హేమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై అవగాహన పెంచుకోవాలి

సారవకోట: రైతులు యాంత్రీకరణ, డ్రోన్లతో వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్.వి. మధు సూచించారు. సోమవారం మండలంలోని వెంకటాపురంలో అయ్యప్ప రైతు సంఘానికి మంజూరైన డ్రోన్‌ను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ప్రారంభించారు. రూ.9.80 లక్షల విలువల గల డ్రోన్‌ను ప్రభుత్వం రూ 7.84 లక్షలు రాయితీపై ఇస్తుందన్నారు. ఈ డ్రోన్ సహకారంతో 6 నుంచి 10 నిమిషాల్లో ఏకరా పొలంలో పురుగు మందు పిచికారీ చేయవచ్చన్నారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, వ్యవసాయాధికారి వెంకటరావు పాల్గొన్నారు.

10 మద్యం బాటిళ్లతో మహిళ అరెస్ట్

పాతపట్నం: మండలంలోని సింగుపురం గ్రామానికి చెందిన మహిళ తన కిరాణా షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ బి.లావణ్య సోమవారం తెలిపారు. ఆమె వద్ద 10 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. ఆమెపై కేసు నమోదు చేశామన్నారు.

బోధనకే పరిమితం చేయాలి

కొత్తూరు: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించి బోధనకే పరిమితం చేయాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, వి.మధుసూదనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తూరు ఎంఈఓ కార్యాలయంలో ఏఈఓలు గోవిందరావు, శ్రీనివాసరావుకు ఉపాధ్యాయుల సమస్యలపై సోమవారం వినతిపత్రం అందజేశారు. పలు రకాల యాప్‌లతో ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనవుతున్నారని అన్నారు. రాష్ట్ర కౌన్సిలర్, జిల్లా కౌన్సిలర్ కొండలరావు, భద్రయ్య, రవి, సంగమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులపై దర్యాప్తు

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద పద్మాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన పనులపై సోమవారం ఎస్.ఎస్.సి డీఈ ఉమామహేశ్వరి దర్యాప్తు చేపట్టారు. పాఠశాలలో జరిగిన పనుల్లో నాణ్యతాలోపాలు ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారని కంచరాన సాయిప్రతాప్ ఫిర్యాదు చేయడంతో పాఠశాల వద్ద దర్యాప్తు చేపట్టారు. అప్పటి హెచ్ఎం తిరుమలరావు, ఏఈ బుచ్చిరాజు, ఫిర్యాదుదారు, కమిటీ సభ్యుల సమక్షంలో వివరాలు సేకరించారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

డప్పు పండగలు నిర్వహించాలి

కొత్తూరు: దళిత డప్పు కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి మండలంలోనూ డప్పు పండగలను నిర్వహించాలని దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గాశి గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత డప్పు కళాకారుల సంఘం విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం కొత్తూరులో నిర్వహించారు. గణేష్ మాట్లాడుతూ డప్పు కళాకారులకు నెలకు రూ.7 వేల పింఛన్ మంజూరు చేయాలన్నారు. మూడెకరాల భూమిని పంపిణీ చేయాలన్నారు. డప్పులు, గజ్జెలు ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలన్నారు. కొత్తూరు, హిరమండలం, భామిని మండలాలకు చెందిన డప్పు కళాకారులతో ఈ నెల 29న కొత్తూరులో ప్రాంతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. డప్పు కళాకారులు పాల్గొన్నారు.

ఇసుక రాంపు మంజూరు

హిరమండలం: వంశధార నదితీర గ్రామం భగీరథిపురం వద్ద ఇసుక ర్యాంపు (డిసిల్టేషన్ పాయింట్ అండ్ స్టాక్ యార్డ్) మంజూరైనట్లు తహసీల్దార్ హనుమంతురావు సోమవారం తెలిపారు. ఇసుక రాంపులో ఎటువంటి యంత్రాలతో లోడ్ చేయకూడదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుకను తీసుకువెళ్లి వినియోగించుకోవాలన్నారు.